# శ్రీ నృసింహ విజయం



సమర్పణ :

**అన్నమాచార్య మిషన్, హైదరాబాదు.**

సౌజన్యం :

**యాదాళ్ల పిచ్చయ్య శెట్టి చారిటీసు, కడప**



ఓం ఉగ్రం వీరం మహావిష్ణుం
జ్వలన్తం సర్వతోముఖమ్
నృసింహం భీషణం భద్రం
మృత్యోర్మృత్యుం నమామ్యహమ్

# శ్రీ నృసింహ విజయం
## మరియు శ్రీ అహోబలక్షేత్ర కథ

*సంకీర్తనలు :*
**తాళ్లపాక అన్నమాచార్యులు**

*వ్యాఖ్యానం, రూపకల్పన :*
**కామిశెట్టి శ్రీనివాసులు**

*సమర్పణ :*
**అన్నమాచార్య మిషన్**

*సౌజన్యం :*
**యాదాళ్ల పిచ్చయ్యశెట్టి చారిటీసు, కడప**

# విన్నపము

అహోబల నృసింహుడు మా ఇలవేలుపు. మా కుటుంబ సభ్యులకు పేరు బలం నరసింహుడు. కష్టసుఖాలలో మమ్మల్ని ఆదుకొని అనుగ్రహించే పరంధాముడు ప్రహ్లాదవరదుడు. తాళ్లపాక అన్నమాచార్యులు శ్రీనివాస చరణాంకితంగ రచించిన ముప్పదిరెండు వేల సంకీర్తనల్లో, అహోబల నారసింహుని గురించినవి కొన్ని వందలైనా ఉన్నవి. ఈ 'నృసింహవిజయం' నా జీవితంలో ఒక ప్రధాన పాత్రను పోషించినది; ఆపదుద్ధారకంగ నిలిచింది. నాలోని మహోద్యమస్ఫూర్తికి ఊపిరులూదినది. అది మహామంత్ర పూరితమై దుష్టగ్రహపీడలను తొలగించినది. ఆసురమైన విఘాతాలను తొలగించి ఆధ్యాత్మికమైన అమర పథాన్ని తీర్చిదిద్దినది. ఇది అనుభవసత్యం. నావంటివారిని సదా కాపాడే విజయగీతిక శ్రీ నృసింహవిజయం.

అన్నమయ్య పాటలకు అర్థవంతమైన బాణీలను కూర్చిన వారు శ్రీపుదుక్కోటై ఆర్. రామనాథన్ భాతృప్రేమతో, ఈ గొప్ప పనిలో, నాకు సహకరించినారు. అడిగినదే తడవుగ తాను

పాడడమే కాక తమ సహోదరి వర్ధిష్ణువు అయిన శ్రీమతి శైలజ గారితో పాడించి 'నృసింహవిజయానికి' తోడ్పడినవారు సహృదయులు, రసహృదయులు సుప్రసిద్ధ గాయకులు శ్రీ ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యంగారు. ధ్యానశ్లోకాన్ని, తిరుమంగై ఆళువారు పాశురాన్ని ఆలపించినవారు బహుముఖ ప్రజ్ఞాశాలి, ఆత్మీయమిత్రులు శ్రీ పి.బి. శ్రీనివాస్‌గారు. ఈ రికార్డింగు తీర్మానంలో తమ సౌహార్దాన్ని, సహకారాన్ని అందించిన బంధువులకు, ఆత్మబంధువులకు నేను ఋణపడి వున్నాను. ఈ 'నృసింహ విజయ' ప్రచారానికి దీక్షించి పనిచేసినవారు హైదరాబాద్ అహోబిలమఠ నిర్వాహకులు స్వర్గీయ శ్రీమాన్ వి.పి. రాఘవాచార్యుల గారు. పారమార్థికమైన వీరి కైంకర్యం కలకాలం వర్చస్వ్యతంగ నిలువగలదు.

నా అన్నమయ్య సంకీర్తన ప్రచార మహోద్యమానికి ఊపిరులూది, నన్ను ముందుకు నడిపిస్తూ నా యోగక్షేమాలను సదా కాంక్షించే శ్రీమాన్ పి.వి.ఆర్.కె. ప్రసాద్, ఐ.ఎ.ఎస్. (రిటైర్డు) గారికి నా హార్దమైన ధన్యవాదాలు.

నే నీమధ్య అహోబలక్షేత్రానికి వెళ్లినప్పుడు అక్కడ నృసింహవిజయం ఆడియో కార్యక్రమాన్ని, అహోబలక్షేత్రం వీడియోలో ఉన్న నా వ్యాఖ్యానాన్ని ఒక సి.డి.గ పైరవీచేసి అమ్మడం బాధ కలిగించింది. నేను రూ.60/- యిచ్చి ఆ పైరవీ సి.డి.ని కొన్నాను. తప్పువాళ్లది కాదు; కంపెనీ సి.డి.ని నలుగురికి అందుబాటులోనికి తేలేని అన్నమాచార్య మిషన్‌దే. క్యాశెట్టు మార్కెటింగును చెన్నైకి చెందిన సంగీత కంపెనికి అప్పగించి నాము. ఆ కంపెనీ వీనిని నిలిపివేయడంతో ఈ అనర్థం సంభవించింది.

అన్నమయ్య మిషన్ బాధ్యత తీసుకొని ఒక సి.డి.గ రూపొందించ కలిగింది. దీని నిర్మాణానికి, గ్రంథ ముద్రణకు వలసిన ఆర్థిక సహకారం శ్రీ యాదాళ్ల పిచ్చయ్యశెట్టి చారిటీసు, కడప వారు అందజేశారు. వారికి మా కృతజ్ఞతలు.

ఈ సి.డిలో అన్నమయ్య శ్రీ నృసింహవిజయం (తాళ్లపాక అన్నమాచార్య సంకీర్తనల)తోబాటు అహోబలక్షేత్రకథను కూడ యిందులో జతపరచినాను. ఈ సి.డి అమ్మకం ద్వారా లభ్యమయ్యే పైసలు (ఖర్చులు మినహాయింపుగ) అహోబల

మఠం హైదరాబాదు వారికే సమర్పిస్తున్నాను. ఈ ఆడియో సి.డి.తో పాటు సముచితంగ గ్రంథాన్ని కూడ జతపరచినాము. 'వెల సులభము. ఫలమధికము' - ఈ మాట నాది కాదు అన్నమయ్యదే.

ఈ నా కైంకర్యాన్ని జన్మనిచ్చిన తల్లిదండ్రుల దివ్య చరణాలకే సమర్పిస్తున్నాను.

'అనిశము తలచరో అహోబలం
అనంతఫలదం బహోబలం'

భవదీయుడు
**కామిశెట్టి శ్రీనివాసులు**
అన్నమాచార్య మిషన్

1-1-2007,
హైదరాబాదు.

# శ్రీ నృసింహ విజయం

"దాచుకో! నీ పాదాలకు తగ నే చేసిన పూజలివి
పూచీ నీ కీరితి రూపు పుష్పములివియయ్యా."

*అన్నమాచార్య మిషన్ సమర్పణ. శ్రీ వేంకటేశ్వర గీతాంజలి*

శ్రీమత్త్వదీయ చరితామృత మన్నయార్య
పీత్వాపినైవ సుహితా మనుజా భవేయుః
త్వం వేంకటాచలపతే రివ భక్తిసారం
శ్రీ తాళ్లపాక గురుదేవ నమో నమస్తే.

అన్నమయ్యకు వేంకటేశ్వరుడే సర్వస్వం. అతని దృష్టిలో రసస్పృష్టిలో తిరుమల వేంకటేశ్వరుడే అహోబల నారసింహుడు. ఇది శ్రీ వేంకటాద్రి నృసింహవిజయం.

శ్రీమత్ పయోనిధి నికేతన చక్రపాణే
భోగీంద్రభోగ మణిరాజిత పుణ్యమూర్తే
యోగీశ శాశ్వత శరణ్య భవాబ్ధిపోత
లక్ష్మీనృసింహ మమ దేహి కరావలంబం.

అదిగో తిరుమలకొండ, వేదాలే శిలలైన కొండ. పుణ్యరాసులే యేరులై ప్రవహించిన కొండ. అది శ్రీనివాసుని కొండ.

**భావింప సకల సంపద రూప మదివో**
**పావనములకెల్ల పావనమయము**
**అదివో......... అదివో......**
**అదివో అల్లదివో శ్రీహరివాసము**
**పదివేల శేషుల పడగల మయము**

**అదె వేంకటాచల మఖిలోన్నతము**
**అదివో బ్రహ్మాదుల కపురూపము**
**అదివో నిత్యనివాస మఖిలమునులకు**
**అదె చూడుడు... అదె మొక్కుడు**
**అదె చూడు డదె మొక్కు డానందమయము**
**అదివో....... అదివో.....**

ఆదిశేషులవారు దక్షిణభారత సౌభాగ్యానికి మురిసి కాబోలు ఒయ్యారంగ పవ్వళించారు. ఆ పడగలపై శ్రీని వాసుడు, నడుముపై నరసింహుడు, తోకపై మల్లికార్జునుడు

ఆవిర్భవించారు. తిరుమల, అహోబిల, శ్రీశైలాలు స్వయం వ్యక్తక్షేత్రాలు.

సంకీర్తనాచార్యుని స్వరలహరులు సప్తగిరులు దొరలి గరుడాచల నరహరి పదాలను అభిషేకించాయి.

**అహోబిలే గారుడశైలమధ్యే**
**కృపావశాత్కల్పిత సన్నిధానం**
**లక్ష్మ్యాసమాలింగిత వామభాగం**
**లక్ష్మీనృసింహం శరణం ప్రపద్యే.**

లక్ష్మీనృసింహుడు అవతరించిన అహోబల క్షేత్రాన్ని స్మరించడం దర్శించడం మన పురాకృత పుణ్యం.

**అనిశము తలచరో అహోబలం**
**అనంత ఫలదం బహోబలం**

**హరి నిజనిలయం బహోబలం**
**హరవిరించినుత మహోబలం**
**అరుణమణిశిఖర మహోబలం**
**అరిదైత్యహరణ మహోబలం**

అగు శ్రీవేంకట మహోబలం
అగమ్య మసురుల కహోబలం
అగపడు పుణ్యుల కహోబలం
అగకులరాజం బహోబలం.

తల్లి లక్కమాంబ ఉగ్గుపాలతో రంగరించిన నరసింహావతార కథలు అన్నమయ్య మనసులో రసవద్గీతాలు చిలికించాయి. అవి తేనెలసోనలై నల్లమల పాదరిళ్లలో పొంగిపొరలుతున్నాయి.

కంటిమి నేడిదె గరుడాచలపతి
ఇంటివేలుపగు ఈశ్వరుడితడు

శ్రీనరసింహుడు చిన్మయకాంతుడు
దానవాంతకుడు దయానిధీ
నానామహిమల నమ్మిన వారిని
పూనుక కాచే పోషకుడితడు.

పరమమూర్తి హరి ప్రహ్లాదవరదుడు
కరుణానిధి బుధకల్పకము

**పరగు శ్రీవేంకపతి తనదాసుల**
**అరుదుగ గాచే అనంతుడితడు.**

**కంటిమి నేడిదె గరుడాచలపతి.**

దేవతలకు మాత్రమే ప్రవేశించడానికి సాధ్యమైన దుర్గమమగు అహోబలక్షేత్రాన్ని ఎనిమిదవ శతాబ్దంలో తిరుమంగై ఆళ్వారు దర్శించి ఆ నరసింహసార్వభౌముని ఇలా కీర్తించారు.

**అంగణ్ న్యాల మంజ అంగోరాళరియా యవుణన్**
**పొంగవాకమ్ వళ్ళుకిరాల్ పోయ్న్ద పునితనిడమ్**
**పైంగణానై క్కొంబు కొండు బత్తిమైయాల్ అడిక్కీయ్**
**చ్చెంగణాళి యిట్టి ఱైంజుమ్ శింగవేళ్కున్టమే.**

అది ఆళ్వారు మంగళాశాసనం. దైత్యసంహారం చేసి అహోబలగుహలలో వికటాట్టహాసాలు చేసే నరకంఠీరవమూర్తి భక్తజనపారిజాతం. శరణాగతి వెన్నెలకిరణాల గిలిగింతలకు నరకేసరి ముఖంలో చిరునగవు లుదయిస్తాయి.

**మలసీ చూడరో మగసింహము**
**అలవి మీరిన మాయలసింహము**

అదివో చూడరో ఆదిమపురుషుని
పెదయౌభళము మీది పెనుసింహము
వెదకి బ్రహ్మాదులు వేదాంతతతులు
కదిసి కానగలేని ఘనసింహము.

బింకమున చూడరో పిరితియ్యక నేడు
అంకపు దనుజసంహారసింహము
వేంకటనగముపై వేదాచలముపై
కింకలేక వడి పెరిగిన సింహము.

ఆ మగసింహం మగువ వలలో చిక్కింది. చెట్టపట్ట వచ్చిన నరహరిని చెంచులక్ష్మి కవ్విస్తూ కల్యాణబంధానికి ముందే నిబంధనలు విధిస్తున్నది. ఇక నరసింహస్వామికి చెట్టూపుట్టా ఎక్కక తప్పదు మరి.

కవయంగ వలెనంటె కౌగిలించేవా
నీ వువిదల తలచక వుండనోపేవా
పారిటాకులు గట్టి పారనోపేవా ఓ నరహరీ
యేరులెల్లదాటి కొండలెక్కనోపేవా

యీరీతి వెదురుబియ్య మేరనోపేవా
పేరిన తేనెలు తెచ్చిపెట్ట నోపేవా

ఇప్పటి మాటలు యీడేరించ నోపేవా
చెప్పినట్టే కాపురము సేయనోపేవా
కప్పురపు శయ్యపై వేంకటరాయడా
యెప్పుడు పాయని చనవియ్యనోపేవా.

'గోవింద కేశవ జనార్దన వాసుదేవ,
విశ్వేశ విశ్వ మధుసూదన విశ్వరూప
శ్రీపద్మనాభ పురుషోత్తమ పుష్కరాక్ష,
నారాయణాచ్యుత నృసింహ నమో నమస్తే'!

స్వాతియోగంలో నృసింహుడు ఆవిర్భవించాడు. అసుర సంధ్య ముగిసింది. భూదేవి పులకించింది. గగనలక్ష్మి స్పందించి జయంతీగీత మాలపిస్తున్నది.

నరులార నేడువో నారసింహ జయంతి
సురలకు ఆనందమై శుభము లొసగెను

సంధించి వైశాఖ శుద్ధ చతుర్దశి శనివార
మందు సంధ్యాకాలమున ఔభళేశుడు
పొందుగా కంభములోన పొడమి కడపమీద
కందువ గోళ్లచించె కనకకశిపుని

కాంచనపు గద్దెమీద గక్కన కొలువై యుండి
మించుగ నిందిర తొడమీద పెట్టుక
అంచె శ్రీవెంకటగిరి ఆదిమపురుషుండై
వంచన సేయక మంచి వరాలిచ్చీని.

నరులార నేడువో నారసింహ జయంతి.

భవనాశిని. భవనాశిని. భవనాశిని అన్వర్థనామంతో ఈ క్షేత్రంలో ప్రవహిస్తున్నది. పతితపావనమైన ఈ నదీమతల్లి తీరంలో నరసింహుడు నవమూర్తులతో సాక్షాత్కరించాడు. అవి ముక్తికాంతావిలాసాలు.

జ్వాలాహోబిల మాలోల క్రోడ కారంజ భార్గవాః
యోగానంద ఛ్చత్రవట పావనా నవమూర్తయః

నవనారసింహా నమోనమో
భవనాశితీర అహోబలనారసింహ

సతతప్రతాప రౌద్ర జ్వాలానారసింహా
వితత వీరసింహ విదారణా
అతిశయకరుణ యోగానందనరసింహ
మతి శాంతపు కానుగుమానినారసింహ

మరలి బీభత్సపు మట్టెమళ్లనరసింహ
నరహరి భార్గోటినారసింహ
పరిపూర్ణ శృంగార ప్రహ్లాదనరసింహ
సిరుల నద్భుతపు లక్ష్మీనారసింహ

వదన భయానకపు వారాహనరసింహ
చెదరని వైభవాల శ్రీనరసింహా
అదన శ్రీవేంకటేశ అందునిందు నిరవైతి
పదివేలు రూపముల బహునారసింహా.

సాక్షాత్తు నృసింహుని వద్దనే సన్యాసాన్ని స్వీకరించిన ఆదివణ్ శఠకోపయతి అహోబలమఠస్థాపనాచార్యులు. తరతమభావం పాటించక సకల ప్రాణికోటికి వైష్ణవాన్ని అనుగ్రహించిన శిష్యసులభుడితడు. అజ్ఞానాంధకారంలో మునిగిన జీవులకు జ్ఞానజ్యోతిని ప్రసాదించి భవసాగరం

దాటడానికి తానొక నావలా నిలిచిన ఈ దొరముని అన్నమా చార్యునికి పరమాచార్యుడు.

**చూడు డిందరికి సులభుడు హరి**
**తోడునీడయగు దొరముని యితడు**

**కైవల్యమునకు కనకపుతాపల**
**త్రోవై శ్రుతులకు తుదిపదమై**
**పావన మొక రూపంబై విరజకు**
**నావై భువి యున్నాడిదె యితడు.**

**కరుణానిధి రంగపతికి కాంచీ**
**వరునకు వేంకటగిరిపతికి**
**నిరతి నహోబల నృకేసరికి త**
**త్పరుడగు శఠగోపముని యితడు.**

సజ్జనులను రక్షించుటకు దుర్జనులను శిక్షించుటకు ధర్మాన్ని స్థాపించడం కోసం ప్రతి యుగంలో నేను అవతరిస్తూ ఉంటాను.

**పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతాం**
**ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే.**

భగవంతుడు నరసింహుడై అవతరించాడు. హిరణ్యకశిపుడు తన్ను నిందించినా వైకుంఠవాసుడు తొణకలేదు. కాని తన భక్తుడైన ప్రహ్లాదుని హింసించడం సహించలేకపోయాడు. సర్వాత్మనా నారాయణార్పణం చేసుకొన్న బాలుని ప్రహ్లాదుని కాపాడడం కోసం, ధర్మానికి గ్లాని కలిగిస్తున్న అసురశక్తిని నిర్జించడం కోసం, అనంతము అజేయము అయిన పరమాత్మ తత్త్వాన్ని ప్రకటించడం కోసం, హరి నరహరిగ ఆవిర్భవించాడు. ఇది ధర్మవిజయం. ఇది నృసింహవిజయం.

**వినరయ్య నరసింహ విజయము జనులాల**
**అనిశము సంపదలు ఆయువు నొసగును**

**మొదల కొలువుకూటమున నుండి కశిపుడు**
**చదివించె ప్రహ్లాదుని శాస్త్రముల**
**అదన నాతడు నారాయణుడే దైవమనె**
**(ఓం నమో నారాయణాయ.......)**
**అదిరిపడి దైత్యుడు ఆతని చూపుమనె**

అంతట ప్రహ్లాదుడన్నిటా ఉన్నాడనియె
పంతమున దానవుడు బాలుని జూచి
యెంతయు కడకతోడ ఇందులో జూపుమని
చెంతనున్న కంబము చేతగొని వేసె

అటమీదట బ్రహ్మాండం బదరుచు
కుటిల భయంకర ఘోషముతో
చిటచిటచిటమని పెటపెటపెటమని
పటపటమనుచును పగిలె కంబము

కులగిరు లదరెను కుంభిని వడకెను
తలకిరి దైత్యులు తల్లడిలి
కలగెను జగములు కంపించె జగములు
ప్రళయకాలగతి పాటిల్లెనపుడు

ఘననారసింహుడదె కంబమునందు వెడలె
కనుపట్టె నవిగో చక్రజ్వాలలు
మునుకొని వెడలె కార్ముకముక్త శరములు
కనకకశిపునకు కలగె గుండియలు

అడరె నద్దేవుని కోపాగ్నులు బెడిదపు
మిడుగురుల తోడుత మిన్నులు ముట్టె
పిడుగులు రాలేటి భీకరనఖరములు
గడుసు రక్కసునికి గాలములై తగిలె

తొడికిపట్టి విష్ణుడు తొడమీద నిడుకొని
కడుపు చించెను వాని గర్వమడగ
వెడలె చిల్లున వాని వేడి నెత్తురు నింగికి
పొడిపొడి యాయ శత్రుభూషణము లెల్లను.

నెళనెళన విరిచె నిక్కివాని యెముకలు
పెళపెళ నారిచి పెచ్చుపెరిగె హరి
జళిపించి పేగులు జంద్యాలుగ వేసుకొనె
తళుకు కోరలు తళతళమని మెరిచె

పెటలించి నరములు పెరిగి కుప్పలు వేసి
గుటగుటమని రొప్పె గోవిందుడు
చిటిలించి కండలు చెక్కలువార చెండి
కుటిల దానవు జూచి ఛోయని యార్చె

తెంచి శిరోజములు దిక్కులకు వాని
పంచప్రాణములను గొనె పరమాత్ముడు
అంచెల నీరీతి ప్రహ్లాదుని పగనీగె
మించి దేవతలు మితిమీరి జయవెట్టిరి.

జయ జయ నృసింహ సర్వేశా
భయహర వీర ప్రహ్లాదవరదా

మిహిరశశినయన మృగనరవేష
బహిరంతస్థల పరిపూర్ణ
అహినాయక సింహాసన రాజిత
బహుళగుణగణ ప్రహ్లాదవరద

జయ జయ నృసింహ సర్వేశా
జయ జయ నృసింహ సర్వేశా
జయ జయ నృసింహ సర్వేశా

అప్పు డిందిరాదేవి అంకమున కూచుండె
ఒప్పుగ శాంతమందె అహోబలేశుడు

తప్పక కోనేటిదండ తానై యిందును నందు
చిప్పిల వరములిచ్చీ శ్రీవేంకటేశుడు

శ్రీ వేంకటేశుడు శ్రీ వేంకటేశుడు
వినరయ్య నరసింహ విజయము.

సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ
అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః.

ధర్మాధర్మ విమర్శనలు మాని నన్నే శరణు పొందుము. నిన్ను పాపవిముక్తిని చేస్తాను. దుఃఖింపకుము.

ఈ నృసింహవిజయము విన్నవారికి ఇహంలో శత్రు విజయం సిద్ధిస్తుంది. దుష్టశక్తిగ్రహ పీడలుండవు. పరంలో పరమాత్మ సాయుజ్యం కలుగుతుంది.

*శ్రియః కాంతాయ కల్యాణనిధయే నిధయేర్థినాం*
*శ్రీవేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్*

# అహోబలక్షేత్ర కథ

కొండలు, అడవులు, నదులు ప్రకృతి కాంతకు నైసర్గికమైన అలంకారాలు. ఆదిశేషుడు పర్వతాకృతిని పొంది నాడని పౌరాణిక విశ్వాసం. పడగలపై వేంకటరమణుడు, నడుముపై నరసింహుడు, తోకపై మల్లికార్జునుడు స్వయం వ్యక్తమూర్తులుగ నిలిచినారు. నల్లమలల సిరులను మగ సిరులను కురిపించినారు.

'అహో వీర్యం అహో శౌర్యం
అహో బాహు పరాక్రమం
నారసింహం పరం దైవం
అహోబల మహోబలం'

పురాణప్రసిద్ధిని, చారిత్రక విఖ్యాతిని పొందిన అహోబల క్షేత్రాన్ని అహోబిలమని కూడ వ్యవహరిస్తారు. నరసింహదేవుని శక్తిని, బలాన్ని దేవతలు ప్రశంసించడం వల్ల అహోబలమైనది. గరుత్మంతుని తపస్సుకు మెచ్చి ఈ కొండబిలంలో నృసింహుడు సాక్షాత్కరించడం వల్ల దీనిని అహోబిలమని వ్యవహరించినారు.

తమిళులు 'శింగవేళ్‌కున్దం' అని ఈ క్షేత్రాన్ని పిలుచు కుంటారు. నననారసింహులు ఈ క్షేత్రంలో సాక్షాత్కరించి ఉండడం వల్ల నవనారసింహక్షేత్రమంటారు.

అహోబలక్షేత్రంలో ప్రధానమైన నది భవనాశిని. లక్ష్మీ నృసింహుని పదసరసిజములను కడిగే పాద్యంగ గగనగంగ ఈ గిరి చేరినది.

ఈ దివ్యక్షేత్రంలో, తీర్థంలో స్వయంగ ఆవిర్భవించిన దేవుడు నరసింహస్వామి. భాగవతంలోని ప్రహ్లాదచరిత్రకు రంగభూమి ఈ అహోబలక్షేత్రం.

సనకసనందాదుల శాపానికి ఆహుతైన వైకుంఠనగర ద్వారపాలకులు జయవిజయులు, హిరణ్యాక్ష హిరణ్య కశిపులుగా అవతరించినారు. హిరణ్యాక్షుని హరి వరాహరూప మెత్తి సంహరించినాడు. పరమభాగవతుడైన ప్రహ్లాదుని కాపాడడానికి హిరణ్యకశిపుని వధించినాడు హరి నరహరిగ అవతారమెత్తి. ఆ అవతారకథ సాగిన ప్రదేశమే ఈ అహోబల క్షేత్రం. అహోబిల నృసింహుడు పరమదయాస్వరూపుడైన శాంతమూర్తి.

అహోబిలక్షేత్ర ప్రసిద్ధికి ఎందరో రాజులు రాజన్యులు వెలలేని సేవలందించినారు.

పల్లవులు, చోళులు, చాళుక్యులు, విద్యానగర రాజులు, కాకతీయులు, రెడ్డిరాజులు అహోబలక్షేత్ర అభివృద్ధికి, వికాసానికి పాటుపడినారు.

15వ శతాబ్దంలో తురుష్కుల దండయాత్రలో ఈ క్షేత్రం పడి నలిగిపోయింది. రంగరాయలనే విజయనగర ప్రభువు తిరుమలరాజు, వేంకటరాజు అనే దండనాథులను పంపి మహమ్మదీయులను పారద్రోలి అహోబలమును కాపాడినాడట. ఆ జయానికి సంకేతంగ ఉన్నతోన్నతమైన జయ స్తంభం ఆలయప్రాంగణంలో నేటికీ నిలిచి ఉన్నది.

'గురు పరంపర' ఒక చారిత్రకసత్యాన్ని తెలుపుతున్నది.

శ్రీశైలం నుండి తిరిగివెళ్లే ప్రతాపరుద్రమహారాజు అహోబలం సమీపంలో రుద్రవరాన విడిదిచేసినాడట. ఆనవాయితీ ప్రకారం ఒక బంగారు శివలింగాన్ని స్వహస్తాలతో పోతపోసినాడు. కాని శివలింగానికి బదులు లక్ష్మీనృసింహుని విగ్రహం ఏర్పడింది. రాజు ఎన్నిమార్లు ప్రయత్నించినా శివలింగం బదులు లక్ష్మీనృసింహమూర్తి ఏర్పడినది. రాజుగారి

ధ్యానసమాధిలో అహోబల నృసింహుడు సాక్షాత్కరించి తన్ను పూజించమన్నాడు. రాజు ఆ విగ్రహాన్ని అహోబలమఠ స్థాపనాచార్యులైన ఆదివణ్ వరకోపయతులకు సమర్పించినాడు. పరమశివభక్తుడైన ప్రతాపరుద్రుడు లక్ష్మీనృసింహుని జీవితాంతము సేవించినాడట. నేటికీ ఆ స్వర్ణవిగ్రహం పీఠాధిపతుల నిత్యపూజలలో చోటుచేసుకొన్నది.

అహోబలక్షేత్రాన్ని నవనారసింహక్షేత్రంగ పేర్కొంటారు.

**జ్వాలాహోబిల మాలోలక్రోడకారంజభార్గవాః**
**యోగానంద చ్ఛత్రవట పావనా నవమూర్తయః**

నరహరి తన అవతారాన్ని భక్తులకోసం తొమ్మిది ప్రదేశాలలో ప్రకటించినారు. అవి ముక్తికాంతావిలాసాలు.

**జ్వాలానృసింహక్షేత్రం**

ఎగువ అహోబలం నుండి సుమారు 4 కి.మీ. దూరంలో ఉన్నది. గరుడాచలం, వేదాచలం అనే పర్వతాల నడుమ **అచలచ్ఛాయమేరు** వనే కొండ మధ్యలో ఉన్నది. ఇది హిరణ్యకశిపుని వధించిన చోటు. ఉగ్రనృసింహుడు కశిపుని చీల్చి తన చేతులను కడిగిన జలాశయం దృగ్గోచరమై ఉన్నది. ఈ నీరు ఎర్రగ, నెత్తురు కడిగినట్లు నేటికీ గోచరించడం

ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఈ తీర్థాన్ని చేతుల్లోకి తీసుకొంటే తెల్లగ మామూలుగ గోచరిస్తాయి.

ఇక్కడ జ్వాలానృసింహమూర్తి పది చేతులతో భిన్న విభిన్న ఆయుధాలతో గరుడపీఠం మీద సుఖాసనాసీనుడై ఉంటాడు. తొడలమీద హిరణ్యకశిపుడు. వారి ఉరాన్ని చీల్చే భంగిమలో స్వామి. కుడివైపు అంజలి ఘటించిన ప్రహ్లాదుడు. ఒకవైపు స్తంభాన్ని వెడలివచ్చే నృసింహుడు. మరొకవైపు చెంచులక్ష్మిని వెంబడించే నరసింహుడు. మొత్తం మూడు శిల్పాలు ఇక్కడ గోచరిస్తాయి.

**అహోబల నారసింహస్వామి**

గుహాంతర్భాగాన వెలసిన ఈ స్వయంవ్యక్తమూర్తి ఈ క్షేత్రంలో ప్రధానమైనది. అందమైన గుడిగోపుర ప్రాకారాలతో విలసిల్లే ఈ ప్రదేశం పురాణప్రసిద్ధిని పొందినది. గరుడుని తపఃఫలమే ఈ స్వామి సన్నిధానం. బ్రహ్మాది దేవతలు అనుదినం ఈ దేవుని అర్చిస్తారని ప్రతీతి.

అహోబలమఠ ఆరవ పీఠాధిపతి ఈ కొండబిలంలో ప్రవేశించి భగవంతునిలో ఐక్యమైనాడని ప్రతీతి. ఆ బిల

మార్గాన్ని శాశ్వతంగ మూసివేసినారు. ఈ ఉగ్రమూర్తి తీక్ష్ణతకు నిదర్శనంగ, వీరి యెదుట పచ్చిగడ్డి నిలిపితే భస్మమై పొగలు చిమ్ముతుందని తెలుపుతారు.

**మాలోల నరసింహుడు**

ఎగువ అహోబలం నుండి 2 కి.మీ. దూరంలో మాలోల నృసింహుని సన్నిధానమున్నది. లక్ష్మీసమేతుడై పరమసౌమ్యంగ గోచరించే ఈ మూర్తిని మాలోల నరసింహుడని వ్యవహరిస్తారు. 'మా' అంటే లక్ష్మి అని తాత్పర్యం.

భవానాశినీ తీరంలో ఈ స్వామిని చేరుకోవడానికి చక్కని సోపానమార్గం ఏర్పడినది.

తొమ్మిది రూపాలతో వెలసిన స్వామి తనకు తానుగ కోరి అహోబలమఠ పీఠాధికారుల సంచారంలో నిరంతరం పూజలందుకొంటున్నది, ఈ మాలోల నృసింహుడే.

ఇదొక ప్రశాంత సుందరమైన చోటు. ధ్యానానుష్ఠానాలకు చక్కని వేదిక.

### క్రోడ నరసింహమూర్తి

ఈ ఉగ్ర నృసింహుని సన్నిధానానికి సమీపంలో భవనాశినీ తీరంలో వరాహరూపంలో నరసింహుడు అవతరించినాడు. ఇక్కడ రెండు విగ్రహాలున్నవి. ఒకటి, భూదేవినుద్ధరించిన వరాహస్వామి. రెండు, లక్ష్మీసమేతుడైన నరసింహుడు.

వరాహ, నరసింహ అవతారాలు రెండు ఒకే యుగానికి చెందినవి. శ్రీభూదేవేరులు భగవంతుని పట్టపురాణులు.

### కారంజ నరసింహుడు

దిగువ ఎగువ అహోబలాలకు మార్గమధ్యంలో గరుడాద్రి పర్వతానికి పడమట కారంజ వృక్షం నీడలో నిలిచినదే కారంజ నరసింహస్వామి సన్నిధానము.

పడగలు విప్పి నిలిచిన ఆదిశేషుని క్రింద ధ్యానసమాధి నిర్మగ్నుడైన మూర్తి విల్లు ధరించి ఉన్నాడు.

ఈ ఆలయానికి ప్రక్కన ఆంజనేయస్వామి వెలసినాడు.

### భార్గవ నరసింహస్వామి

వీరిని భార్గోటిస్వామి అని కూడ స్థానికులు వ్యవహరి

స్తారు. భార్గవతీర్థానికి సమీపంలో ఒక చిన్న కొండమీద వెలసిన క్షేత్రం. ఇది దిగువ అహోబిలం దేవాలయానికి సుమారు రెండు కి.మీ. దూరంలో ఉన్నది. భార్గవరాముడు యజ్ఞము చేసిన చోటు. పరశురాముని పూజలందుకొన్న దివ్యధామము.

రెండు చేతులలో శంఖచక్రాలు, మరో రెండు చేతులతో హిరణ్యకశిపుని కడుపు చించి పేగులు తీసే భంగిమలో ఉన్న మూర్తి హిరణ్యకశిపుని కుడిచేతిలో ఖడ్గం, చెంత అంజలి ఘటించిన ప్రహ్లాదుడు. ఆ శిలలోనే దశావతారతోరణం ఉన్నది. నృసింహదేవుని శిరస్సుపైన కిరీటం ఉండడం విశేషం.

**యోగానందనరసింహుడు**

దిగువ అహోబలానికి రెండు కి.మీ. దూరంలో. వేదాద్రి కొండలకు పడమట దక్షిణం దిక్కు ముఖమై ఈ యోగానంద నరసింహుడు యోగపట్టంతో విలసిల్లినాడు. ప్రహ్లాదుడు ఈ యోగ నృసింహుని అనుగ్రహంతో యోగాభ్యాసం చేసినాడట.

**ఛత్రవట నరసింహస్వామి**

యోగానందనరసింహస్వామి సన్నిధికి సమీపంలో వటవృక్షం నీడలో నిలిచిన స్వామి యోగానంద నరసింహ స్వామి అవతరించినాడు. ముంగిట అరుస్తంభాల ముఖ

మండపం. నల్లరాతితో నిర్మించిన మూర్తి నిగనిగలాడు తున్నది. పద్మాసనాసీనుడైన స్వామివారు, శంఖచక్రాలను ధరించినారు. కటి అభయహస్తాలతో, యజ్ఞోపవీతంతో స్పష్టంగ మలచిన ఈ మూర్తి చాల అందమయినది, ఆకర్షణీయమైనది.

**పావన నరసింహుడు**

గరుడాద్రికి దక్షిణాన పరమపావన ప్రదేశంలో ఏడు పడగల శేషుని క్రింద తీర్చిదిద్దిన మూర్తి. రెండు చేతులలో శంఖచక్రాలు. ఒక చేతితో తొడమీద కూర్చున్న మహాలక్ష్మిని ఆలింగనం చేసుకొని మరొక చేతిలో అభయముద్రను నిలిపినాడు. స్థానికులు, చుట్టుప్రక్కల గ్రామాలవాళ్లు ఈ స్వామికి ఏటా ప్రత్యేకపూజలను నిర్వహిస్తారు. పాములేటి స్వామీ! అంటూ ఈ లక్ష్మీనృసింహునికి విశేష సమర్పణలు చేస్తారు. ఈ మూర్తిచెంత మురళీమోహనుడైన శ్రీకృష్ణప్రతిమ వెలసినది.

**ప్రహ్లాదవరదుడు**

దిగువ అహోబలంలో వెలసిన ప్రహ్లాదవరదుని సన్నిధానం విశిష్టాద్వైత కార్యకలాపాలకు కేంద్రం. వేద

ఘోషలతో, దివ్యప్రబంధసూక్తులతో, అర్చనలతో, ఆరగింపు లతో కోలాహలంగ ఉంటుంది. శ్రీకార్యపరుల పరమైకాంతిక భక్తికి అమృతవల్లీ సమేత లక్ష్మీనృసింహుడు పరవశించి, సేవింప వచ్చిన వారికి కోరకనే వరాలననుగ్రహిస్తారు.

ప్రహ్లాదవరదుడు లక్ష్మీసమేతుడై ఉగ్రసుందరంగ శేషపీఠం మీద నిలిచినాడు. వీరికి సన్నిహితంగ ఆండాళమ్మ సన్నిధి, అమృతవల్లి అమ్మవారి గుడి ఉన్నవి.

పద్మావతీ శ్రీనివాసులు కల్యాణము చేసికొని ఈ నరసింహుని దర్శించడానికి విచ్చేసినట్లు ఐతిహ్యమున్నది. దానికి సాక్షిగ కల్యాణవేంకటేశ్వర సన్నిధి నిలిచిఉన్నది. ఇక్కడ వైష్ణవ ఆచార్యులకు, ఆళువారులకు ప్రత్యేక సన్నిధానమున్నది.

అహోబలనృసింహుని సుప్రభాతసుందరసేవలు....., ఏకాంతసేవ సొగసులును నింపుకొన్నవి. అద్దాలమండపంలో అయ్యవారు అమ్మవారులతో శఠకోపయతుల సాక్షిగ వింత వెలుగులను విరజిమ్ముతున్నారు.

నవరాత్రులలో దశమినాడు నిర్వహించే జమ్మిచెట్టుపూజ వైభవోపేతంగ సాగుతుంది. విల్లమ్ముల ప్రయోగం. స్థానికులు ముఖ్యంగ చెంచులు నెరిపే వేడుకలు గ్రామీణ

వాతావరణానికి అద్దం పడుతుంది. ఆలయవిధులలో, పూజాపునస్కారాలలో తెలిసో తెలియకో జరిగిన శైథిల్యాలకు ప్రాయశ్చిత్తంగ, వర్చస్స్వంతంగ క్షేత్రం ఉత్తరోత్తర విరాజిల్లడానికి 'పవిత్రోత్సవాలు' నిర్వహింపబడుతున్నవి.

ఎన్నో నిత్యసేవలు, ఆర్జితసేవలను నిర్వహించే ఆలయ పాలకులు ఏటేటా 45 రోజులపాటు సంక్రాంతికి పారువేట ఉత్సవాలను అనితరసాధ్యంగ నిర్వహిస్తున్నారు. శ్రీవారి ఉత్సవమూర్తులు 30 గ్రామాలు పర్యటిస్తాయి.

ఆంధ్రప్రదేశ్ కర్నూలు జిల్లా ఆర్లగడ్డ తాలూకా నుండి ఈ క్షేత్రానికి చక్కని రహదారి ఏర్పడింది. అన్ని ప్రధాన క్షేత్రాల నుండి ఈ అహోబలం చేరడానికి రవాణా సౌకర్యములున్నవి. తీర్థయాత్రలో ప్రధానమైన ముండనం, స్నానం, దర్శనం, మొదలైనవానికి ఇక్కడ అవకాశమేర్పడింది. దిగువ అహోబలం చేరుకొని, ప్రహ్లాదవరదుని సేవించుకొని, ఎగువ అహోబలంలో గుహాంతర్భాగాన నిలిచిన అహోబల నృసింహుని అర్చించుకొని, భవనాశినీ జలాలలో సేదతీర్చుకొని, ఓర్పుతో క్రమంగ నవనారసింహక్షేత్రాలను దర్శించుకొని, ప్రహ్లాదుని బడిలో బండమీద నిలిచి భాగవత సుందర జ్ఞాపకాలను పొంది,

ఉగ్రస్తంభప్రదక్షిణలతో పునీతమై, తీర్థయాత్రను ఫలవంతం చేసుకోవడానికి నేడు అవకాశమున్నది.

దిగువ అహోబిలం ప్రహ్లాదవరదుని సన్నిధానం. ఉదాత్త సుందరమైన శిల్పకళలను విరాజిల్లుతున్నవి.

నవనారసింహుల అనల్పరూపకల్పన రంగమండపంలో నిలిచి మురిపిస్తాయి. తొమ్మిది దేవాలయాలు తిరిగి చూడలేని వారికి నేత్రతర్పణం చేస్తాయి. మృగరాజు మొగాన చిరునగవు, కశిపుని తలపట్టి నిలిపిన సంగ్రామ నృసింహమూర్తి ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి.

ఆలయప్రాంగణంలో నాట్యమండపంలో నట్టువగత్తెల విలాసవిభ్రమాలను మన కళ్లముందు నిలిపి 'సర్వేంద్రియానాం నయనం ప్రధానమనే సూక్తిని' నిజం చేస్తాయి.

శిలల తోరణాలు, రణభూమికి సాగే యోధులు, రథగజ తురగపదాతులు ఆలయ భిత్తికలలో నిలిచి ప్రేక్షకులకు గిలిగింతలు పెడతాయి.

'అటవ్యాం నారసింహశ్చ' ఈ అరణ్య జీవయాత్రను అమృతమయంగ చేయగలిగిన దేవదేవుడు అహోబల

నారసింహుడు. ఈ అడవి జీవితానికి తోడునీడ నల్లమల లక్ష్మీనరసింహుడు.

**అనిశము తలచరో అహోబలం**
**హరినిజనిలయం అహోబలం**
**అహోబలం అహోబలం అహోబలం.**

అహోబలక్షేత్రం. స్థితిగతులతో, పూజాపునస్కార విధులతో, ఉత్సవవైభవాలతో విరాజిల్లడానికి ప్రధానకారణం అహోబలమఠ స్థాపనాచార్యులైన ఆదివణ్‌శఠకోపయతులు.

యతిరూపధారియైన నరసింహస్వామి 'శఠకోప' అనే దాస్యనామాన్ని వీరికి కృపచేసినారు.

శ్రవణ్ శఠకోప శ్రీనారాయణ యతీంద్ర మహాదేశికులు అహోబలమఠ వర్తమాన 45వ పీఠాధినేతలు. అహోబల నృసింహుడు వీరి కైంకర్యాలకు మురిసిపోయినాడు. పాడుపడిన పుష్కరిణిని ఉద్ధరించి భక్తుల ఉపయోగానికి నిలిపినాడు. నవనారసింహక్షేత్రాలను పునరుద్ధరించి పూజా పునస్కారాలను ఏర్పాటుచేసి, యాత్ర సుగమంచేసి ఆస్తికుల ప్రశంసలకు పాత్రులైనారు.

యాత్రికుల సౌకర్యార్థం ఎగువదిగువ అహోబలాలలో భోజనవసతిగృహములు వెలసినవి.

నిత్యోత్సవాలు, వారోత్సవాలు, పక్షోత్సవాలు, మాసోత్సవాలు, తిరువీధుల ఉత్సవాలు వెల్లివిరిసినవి. మూల మూర్తులు దివ్యాభిషేకాలతో, ఉత్సవమూర్తులు బంగారు కవచాలతో, దివ్యాభరణాలతో నేత్రపర్వంగ నిలిచినవి.

ఒకనాడు మూగవోయిన అహోబలక్షేత్రం ఇప్పుడు భక్తజనులను చేరి రమ్మని ఎలుగెత్తి పిలుస్తున్నది.

**అంగణ్ న్యాల మంజ అంగోరాళరియా యవుణన్**
**పొంగవాకమ్ వళ్ళుకిరాల్ పోయ్న్ద పునితనిడమ్**
**పైంగణానై క్కొంబు కొండు బత్తిమైయాల్ అడిక్కియ్**
**చ్చెంగణాళి యిట్టి ఱైంజుమ్ శింగవేళ్కున్ఱమే.**

**అనుబంధం-1**

(వీడియో చిత్రీకరణలో కత్తిరింపులకు లోనైన
వ్యాఖ్యానంలోని కొన్ని వాక్యాలు)

కొండలు, అడవులు, నదులు ప్రకృతి కాంతకు నైసర్గిక మైన అలంకారాలు.

అవి మానవజాతికి భగవంతుడనుగ్రహించిన గొప్ప వరాలు. మానసోల్లాసాన్ని, హృదయాహ్లాదాన్ని కలిగించే ఈ ప్రాకృతిక సన్నివేశాలు పరమధామాలై ఆధ్యాత్మిక శోభను సంతరించుకొన్నవి.

ధర్మవీరాన్ని, కర్మనిష్ఠను నిరంతరం జాగృతం చేసే ప్రకృతి దేవాలయాలు మన తీర్థాలు, క్షేత్రాలు. భారతదేశానికి దేవతాత్మ హిమాలయము ఉత్తరాన. దక్షిణ భారత సౌభాగ్య రేఖలై నిలిచినవి శేషాచలసానువులు.

* * *

అహోబలక్షేత్రానికి నిధి, నగరి అనే పేర్లు కూడ ఉన్నట్లు శాసనాలలో కనిపిస్తుంది.

* * *

అహోబలక్షేత్రంలో ప్రధానమైన నది భవనాశిని.

లక్ష్మీనృసింహుని పదసరసిజములను కడిగే పాద్యంగ గగనగంగ ఈ గిరి చేరినది.

భవనాశిని, భవనాశిని, భవనాశిని అని భక్తులు పలు మార్లు పలకడం వల్ల ఈ నది భవనాశిని అనే పేరును సార్థకం చేసుకొన్నది. ఈ క్షేత్రంలో కొన్ని వందల దివ్యతీర్థాలున్నాయని ప్రతీతి. వీనిలో పంద్రెండు తీర్థాలను ప్రధానంగ పేర్కొంటారు. ప్రతి తీర్థానికి ఒక కథ ఉన్నది.

కనకావతి, భోగావతి నదులలో లక్ష్మీనారసింహులు వసంతాలాడినట్లు సంకీర్తనాచార్యుడు అన్నమాచార్యుడు పేర్కొంటారు. ఈ కొండలలో నరహరి కరుణారసమే పొంగి ఏరులై ప్రవహించినదట.

**'అటవ్యాం నారసింహశ్చ'**

సంసారమనే ఈ అరణ్యంలో ప్రయాణం సాగించే మనకు కంటకాల వంటి ఆటంకాలను తొలగించి, ఘాతుక మృగాల వంటి వంచకులు, నయవంచకుల నుండి తప్పించి, అగమ్యము దుర్గమము అయిన మార్గాలను సుగమం చేసి

బుసకొట్టే విషసర్పాల తుచ్ఛకాంక్షలకు దూరం చేసి, పలు వన్నెలతో లోభపెట్టి, పిచ్చిపళ్లవంటి క్షుద్రమైన ఆశలకు లోబడనీయక, తరుచ్ఛాయల వంటి కరుణాకటాక్షాలతో, రసభరిత ఫలాలనే వరాలతో అనుగ్రహించి, అనిర్వచనీయము, శాశ్వతము, అనంతము అయిన సత్యజ్ఞాన మోక్షాల గమ్యం చేర్చే దేవుడు నరసింహుడు, సద్యఃఫలాల నందజేసే అవతారమూర్తి అహోబల నారసింహుడు.

* * *

'ఇందుగలడు అందులేడు' అనే సందేహంతో, సంశయంతో సంచరించే అజ్ఞానికి ఎందెందు వెదకి జూచిన అందందే గలడని పరమాత్మ తత్త్వజ్ఞానాన్ని ప్రసాదించిన ప్రహ్లాదుని భక్తివిజ్ఞానం వెల్లివిరిసిన జ్ఞానక్షేత్రం అహోబలం. ధర్మాన్ని, నీతిని, న్యాయాన్ని రాక్షసప్రవృత్తితో అణగద్రొక్కి మితిమీరిన కండకావరంతో విర్రవీగిన కశిపుని చీల్చిచెండాడిన ధర్మసంస్థాపకక్షేత్రం ఈ అహోబలం.

* * *

వాడినఖాలతో, కోరలతో ఒప్పిన నృసింహమంత్ర

రాజాన్ని దర్శించిన ప్రజాపతి సకల భువనాలను సృజించి నాడట. ఈ మంత్రం సకల మంత్రాలకు, తంత్రాలకు, యంత్రాలకు మూలం.

పంజాబు రాష్ట్రం కాంగ్రా జిల్లాలో నృసింహమూర్తిని టెంకాయ రూపంలో పూజిస్తారు.

గుప్తరాజుల నాణాలలో నృసింహ లాంఛనం కనిపిస్తుంది. ద్రవిడదేశానికి చెందిన ఆళువారులు పాశురాలలో ఈ నృసింహదేవుని కీర్తించినారు.

శంకరభగవత్పాదుల లక్ష్మీనృసింహ కరావలంబం సుప్రసిద్ధమైనది.

భగవద్రామానుజులు, వేదాంతదేశికులు, చైతన్య ప్రభువులు మొదలైన ఆచార్యులు ఈ స్వామిని సేవించి తరించినవారే.

అనుబంధం-2

# శ్రీ సుదర్శనాష్టకమ్

శ్రీమాన్ వేఙ్కటనాథార్యః కవితార్కిక కేసరీ
వేదాంతాచార్యవర్యో మే సన్నిధత్తాం సదా హృది.

ప్రతిభట శ్రేణీ భీషణ వరగుణ స్తోమ భూషణ
జనిభయ స్థాన తారణ జగదవస్థాన కారణ
నిఖిల దుష్కర్మ కర్శన నిగమ సద్ధర్మ దర్శన
జయ జయ శ్రీసుదర్శన జయ జయ శ్రీసుదర్శన. 1

శుభ జగద్రూప మండన సురజన త్రాస ఖండన
శతమఖ బ్రహ్మ వందిత శతపథ బ్రహ్మ నందిత
ప్రథిత విద్వత్సపక్షిత భజదహిర్బుధ్న్య లక్షిత
జయ జయ శ్రీసుదర్శన జయ జయ శ్రీసుదర్శన. 2

స్ఫుట తటిజ్జాల పిఞ్జర పృథు తర జ్వాల పఞ్జర
పరిగత ప్రత్న విగ్రహ పటుతర ప్రజ్ఞ దుర్గ్రహ
ప్రహరణ గ్రామ మణ్డిత పరిజన త్రాన పణ్డిత
జయ జయ శ్రీసుదర్శన జయ జయ శ్రీసుదర్శన. 3

నిజ పద ప్రీత సద్గణ నిరుపధి స్ఫీత షడ్గుణ
నిగమ నిర్వ్యూఢ వైభవ నిజ పర వ్యూహ వైభవ
హరి హయ ద్వేషి దారణ హర పురప్లోష కారణ
జయ జయ శ్రీసుదర్శన జయ జయ శ్రీసుదర్శన. 4

దనుజ విస్తార కర్తన జని తమిస్రా వికర్తన
జగదవిద్యా నికర్తన భజదవిద్యానివర్తన
అమర దృష్ట స్వ విక్రమ సమర జుష్ట భ్రమిక్రమ
జయ జయ శ్రీసుదర్శన జయ జయ శ్రీసుదర్శన. 5


ప్రతిముఖాలీఢ బన్ధుర పృథు మహా హేతి దన్తుర
వికటమాయా పరిష్కృత వివిధ మాలా బహిష్కృత
స్థిర మహా యన్త్ర తన్త్రిత దృఢ దయాతన్త్ర యన్త్రిత
జయ జయ శ్రీసుదర్శన జయ జయ శ్రీసుదర్శన. 6

మహిత సంపత్షడక్షర విహిత సంపత్షడక్షర
షడర చక్ర ప్రతిష్ఠిత సకల తత్త్వ ప్రతిష్ఠిత
వివిధ సఙ్కల్ప కల్పక విబుధ సఙ్కల్ప కల్పక
జయ జయ శ్రీసుదర్శన జయ జయ శ్రీసుదర్శన. 7

భువన నేత స్త్రయీమయ సవనతేజ స్త్రయీమయ
నిరవధి స్వాదు చిన్మయ నిఖిలశక్తే జగన్మయ
అమిత విశ్వక్రియామయ శమిత విష్వగ్భయామర
జయ జయ శ్రీసుదర్శన జయ జయ శ్రీసుదర్శన. 8

ద్విచతుష్క మిదం ప్రభూత సారం
పఠతాం వేంకటనాయక ప్రణీతం
విషమేఽపి మనోరథః ప్రధావన్
న విహన్యేత రథాఙ్గధుర్యగుప్తః. 9

కవితార్కిక సింహాయ కల్యాణ గుణశాలినే ।
శ్రీమతే వేంకటేశాయ వేదాంతగురవే నమః ॥




ఫాలనేత్రానల ప్రబల విద్యుల్లతా
కేళీవిహార లక్ష్మీనారసింహా
- అన్నమయ్య

# యాదాళ్ళ పిచ్చయ్యశెట్టి చారిటీస్ అసోసియేషన్
## కడప

**స్థాపితం :** 1920లో ఏకైక వైశ్య కుటుంబ నిధుల నుండి ఏర్పడినది.

**సంస్థాపకులు :** శ్రీ యాదాళ్ళ పిచ్చయ్యశెట్టి గారు

**ధ్యేయం :** • నిరంతర అన్నదాన సేవ • ధర్మసత్ర నిర్వహణ • పేద విద్యార్థులకు ఉచిత భోజన వసతి సదుపాయాలు • మహిళాభ్యుదయ కార్యక్రమాలు • దేవాలయ పూజా పునస్కార విధులలో పాల్గొనడం • ప్రజాశ్రేయస్సుకు సంబంధించిన కార్యక్రమాలలో పాలుపంచుకోవడం

**దానధర్మాలు :** • వరసిద్ధి వినాయక దేవాలయం, కాణిపాకం. నిత్యాన్నదాన పథకానికి లక్ష రూపాయల విరాళం. • శ్రీ భ్రమరాంబ మల్లికార్జున దేవాలయం, శ్రీశైలం. నిత్యాన్నదాన పథకానికి లక్ష రూపాయల విరాళం. • శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయం, కస్సాపురం. నిత్యాన్నదాన పథకానికి లక్ష రూపాయల విరాళం. • కడప వరద బాధితుల సహాయార్థం ముప్పైవేల రూపాయల విరాళం. • అన్నమయ్య విగ్రహ స్థాపనకు కడపలో లక్ష రూపాయల విరాళం (కడపోత్సవాల సందర్భంగా). • సునామీ వరద బాధితుల సహాయార్థం గౌ. ముఖ్యమంత్రి సహాయనిధికి లక్షరూపాయల విరాళం